మీర్‌పేట్‌లో నిధుల గోల్‌మాల్..
'ఆంధ్రజ్యోతి' కథనంపై సర్వత్రా చర్చ

- ఇంజనీరింగ్ విభాగంపై ఆరోపణలు వెల్లువ
- వర్క్ ఇన్‌స్పెక్టర్‌దే అంతా పెత్తనం
- బినామీ పేర్లతో టెండర్లు సైతం !

సరూర్‌నగర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లో నిధుల గోల్‌మాల్ అంశంపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. చేయని పనికి చేసి మట్టి అంటకుండా రూ.2.34లక్షలు స్వాహా చేసినట్లు సదరు కథనంలో సవివరంగా పేర్కొనడంతో కార్పొరేషన్‌లోని అన్ని విభాగాల్లో శుక్రవారమంతా ఇదే చర్చ కొనసాగింది. ఇక మీర్‌పేట్, జిల్లెలగూడలలోని 46 డివిజన్లలో ఎవరిని కదిలించినా 'ఆంధ్రజ్యోతి' కథనం గురించి చర్చించుకోవడమే కనిపించింది. కేవలం ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సహాయకుడిగా ఉండాల్సిన వర్క్ ఇన్‌స్పెక్టర్ పనులను పర్యవేక్షించాల్సిన ఓ సాధారణ వర్క్ ఇన్‌స్పెక్టర్.. ఒక్క పనిలోనే దాదాపు రూరెండు లక్షలు బొంచేయగా, ఇంకా ఎన్ని పనుల్లో ఇలా అవినీతికి పాల్పడి ఉంటాడోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇంజనీరింగ్ విభాగం పూర్తిగా భ్రష్టుపట్టి పోయిందని, ఎన్ని శ్వేతపత్రాలు వేసినా, ఎన్నింటికి టెండర్లు వేశారో, ఎన్ని పనులు మొదలు పెట్టారో, ఎన్ని పూర్తి చేశారో తెలియని అయోమయ పరిస్థితి మీర్‌పేట్‌లో నెలకొన్నదని ప్రజాప్రతినిధులకు చెందిన ఓ పౌరుడు పేర్కొన్నారు. దీంతో, ఏతంతకీ తెలియకుండా వర్క్ ఇన్‌స్పెక్టర్ ఒక్కరే ఇంత సాహసానికి ఒడిగట్టి ఉంటాడా.. లేక సదరు అధికారులు సైతం ఇందులో పాత్రధారులుగా ఉన్నారా అన్నది తేలాల్సి ఉంది. పనులు చేయకుండానే ఎంబీ రికార్డు ఎలా చేశారు.. అకౌంట్స్ విభాగంలో బిల్లుకు సంబంధించిన చెక్కును ఎలా జారీ చేశారు అనే అంశాలపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కోట్లాది రూపాయల పనుల్లో నొక్కేసినవి ఎన్నో..!?

మీర్‌పేట్ కార్పొరేషన్‌గా అవతరించినప్పటి నుంచి నేటి వరకు కోట్లలో అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే సందిగ్ధాల్లోని ఐదుమ్మ కమ్యూనిటీహాల్ వ్యవహారం బయటపడడంతో.. సదరు కోట్ల విలువైన పనుల్లో ఎంత కుంభకోణం జరిగిందో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత జనవరి వరకు కొనసాగిన పాలకవర్గం హయాంలోనూ పలు డివిజన్లలో నాటి

అతడే ఒక కాంట్రాక్టర్..?

మీర్‌పేట్‌లోని వర్క్ ఇన్‌స్పెక్టర్ ఓ కాంట్రాక్టర్‌గా చెలామణి అవుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కార్పొరేషన్‌లోని మరో ఉద్యోగితో కలిసి సదరు వర్క్ ఇన్‌స్పెక్టర్ ఓ కాంట్రాక్ట్ సంస్థను ఏర్పాటు చేసి, ఆ పేరుతో మూడో కంటికి తెలియకుండా టెండర్లు వేసి పనులు సొంతం చేసుకుంటున్నట్లు తెలిసింది. ఆలా సొంతం చేసుకున్న పనుల్లో పలు పనులు చేయకుండానే బిల్లులు స్వాహా చేసినట్లు సమాచారం.

మీర్‌పేట్‌లో రూ.2.34లక్షలు గోల్‌మాల్ !



శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

పలువురు ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో ఇలాంటి అవకతవకలు జరిగినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

విజిలెన్స్ విచారణ చేపట్టాలి

మీర్‌పేట్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భారీ మొత్తంలో అవినీతి చోటు చేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో విజిలెన్స్ విభాగం అధికారులు దీనిపై దృష్టి సారించి విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కార్పొరేషన్‌లోని టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్, ఇంజనీరింగ్, అకౌంట్స్ తదితర అన్ని విభాగాల్లో నిధుల వ్యయంపై విచారణ జరిపితే మొత్తం 'గోల్‌మాల్' ఎంత తేలుతుందని వారంటున్నారు. మరి ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులు దీనిపై దృష్టి సారిస్తారో లేదో వేచి చూద్దాం!.



ఏరియా ఆస్పత్రిలోని సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిని సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఆస్పత్రికి ప్రతి రోజు వివిధ జిల్లాల నుంచి సుమారు 1500 మంది వరకు రోగులు వస్తుంటారని వారికి మరింతగా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆస్పత్రి సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణ, నాగేందర్, వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్, ముద్దగౌని సుమన్‌గౌడ్ పాల్గొన్నారు.

పార్కు, ఔట్‌డోర్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ ఎస్‌బీఐ కాలనీలో ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాటు చేసిన పార్కును, ఔట్‌డోర్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ కోరారు. శుక్రవారం ఆయన పార్కును, జిమ్‌ను కాలనీ ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులో పచ్చిక, కూర్చోవడానికి బెంచీలు, వాకింగ్ ట్రాక్, వ్యాయామ పరికరాలు ఏర్పాటు కోసం సహకరించిన స్థానిక ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌కు, అర్బన్ బయోడైవర్సిటీ డెవలప్‌మెంట్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంది రాజేష్, గుర్రు మహేష్‌కుమార్, తిరుమల్, ఎస్‌బీఐ కాలనీ అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో అందరూ భాగస్వాములవ్వాలి

మన్సూరాబాద్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ కలలుగన్న స్వచ్ఛభారత్‌ను నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి భరత్‌ప్రసాద్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కొప్పుల నర్సింహారెడ్డిలు పేర్కొన్నారు. బీజేపీ సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా మన్సూరాబాద్ ఓబీసీ మోర్చా, బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు మునగాల హరీశ్‌రెడ్డిల సంయుక్తాధ్వర్యంలో డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఆవరణలో స్వచ్ఛభారత్ చేపట్టారు. ఈ కార్యక్రమానికి భరత్‌ప్రసాద్, కొప్పుల నర్సింహారెడ్డిలు విచ్చేసి ఓబీసీ మోర్చా, బీజేపీ, బీజేవైఎం నాయకులతో కలిసి ఆస్పత్రి ఆవరణను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్, మహిళా మోర్చా డివిజన్ అధ్యక్షురాలు మంగారెడ్డి, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు పందుల ప్రవీణ్‌కుమార్‌గౌడ్, నాయకులు లింగాచారి, ఎర్ర అమరేశ్వర్ ముదిరాజ్, యంజాల జగన్ పాల్గొన్నారు.

'అపరిశుభ్రంగా.. ఆకతాయిలకు అడ్డాగా చిన్నచెరువు'

మన్సూరాబాద్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ చిన్నచెరువు ఆపరిశుభ్రంగా ఆకతాయిలకు అడ్డాగా మారిందని స్థానిక కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ప్రశాంత్‌నగర్ కాలనీవాసుల విన్నపం మేరకు మార్నింగ్‌వాక్‌లో భాగంగా కార్పొరేటర్ చిన్నచెరువు ప్రాంగణాన్ని శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రశాంత్‌నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

మదర్‌డెయిరీ డైరెక్టర్ల ఎన్నికలకు 8 నామినేషన్లు

హయత్‌నగర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ మదర్‌డెయిరీలోని మూడు డైరెక్టర్ పదవులకు ఈనెల 30తో పదవీకాలం ముగియనుండడంతో ఆ పాలకవర్గ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా శుక్రవారం నామినేషన్లను స్వీకరించారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను దాఖలు చేశారు. జనరల్ మహిళా రిజర్వు స్థానానికి మోతే పూలమ్మ, సూదగాని ఇంద్రమ్మ, సూదగాని విజయలు నామినేషన్లు వేశారు. రెండు జనరల్ పాలకవర్గ స్థానాలకు మచ్చ కొండల్‌రెడ్డి, సీహెచ్ సురేందర్‌రెడ్డి, నక్క శ్రీశైలం, గుత్త యాదగిరిరెడ్డి, శీలం వెంకటనర్సింహారెడ్డిలు నామినేషన్లు దాఖలు చేశారు. మూడు పాలకవర్గం స్థానాల్లో ఒక జనరల్ మహిళా స్థానానికి 3, రెండు జనరల్ స్థానాలకు 5 నామినేషన్లు వేశారని ఎన్నికల అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం నామినేషన్ల పరిశీలన జరుగుతుందన్నారు. తుది జాబితా మధ్యాహ్నం 2గంటల తర్వాత ప్రకటిస్తామన్నారు. 22వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. ఎన్నికలు అనివార్యం అయితే 27వ తేదీన ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

సరూర్‌నగర్ చెరువుకట్ట పనుల క్షేత్రస్థాయి పరిశీలన



చెరువు కట్ట అభివృద్ధిపై చర్చిస్తున్న జెడ్సీ హేమంత్ పాటిల్, కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ చెరువు కట్ట అభివృద్ధి పనుల కోసం శుక్రవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్, కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డిలు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. చెరువుకట్టను బలోపేతం చేయడంతో పాటు వర్షపునీటిని మళ్లించడం, కొత్త డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేయడం గురించి చర్చించారు. చెరువు అందాలను పరిరక్షించడంతో పాటు పచ్చదనం పెంపొందించడం, కట్టకు ఆనుకుని కొత్త వంతెన నిర్మించడం వంటి పనులు త్వరితగతిన చేపట్టాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ జోనల్ ఎస్‌ఈ అశోక్‌రెడ్డి, సరూర్‌నగర్ ఉపకమిషనర్ బోనగిరి శ్రీనివాస్, ఉపకమిషనర్ మల్లికార్జున్, ఎస్‌ఎన్‌డీపీ ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ మాధవిలత, జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ ఈఈ కార్తిక్, ఈఈ(లేక్స్) నరసింహ, సరూర్‌నగర్ ఈఈ రమేష్‌బాబు, ఏఈలు ప్రత్యూష, సత్యబాబు, డీఈ రవీందర్, విజయ్‌కుమార్, ఏఈలు విజయ్‌కుమార్, మల్లికార్జున్, ఏఈ లేక్స్ సతీష్, ఎస్‌ఎన్‌డీపీ ఏఈ సతీష్ పాల్గొన్నారు.

వేద విద్య దేశభక్తి విలువలను పెంపొందిస్తుంది

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



వేద పాఠశాల వద్ద బీజేపీ నాయకులతో రామచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

అబ్దుల్లాపూర్‌మెట్ : వేద విద్య ధర్మబద్ధత, దేశభక్తి విలువలను పెంపొందిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. కుంట్లూర్‌లోని శ్రీవేదవ్యాస పాఠశాల ట్రస్ట్ నిర్వాహకుల ఆహ్వానం మేరకు శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ వృద్ధి, భవిష్యత్ భారత నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలని వేద విద్యార్థులకు సూచించారు. భారతదేశ పరిరక్షణలో కీలకపాత్ర పోషించేలా విద్యార్థులను తయారు చేస్తున్న పాఠశాల నిర్వాహకులను రామచందర్‌రావు అభినందించారు. కార్యక్రమంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి, అధికార ప్రతినిధి వర్షిత్ బాల్‌రెడ్డి, ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు పిల్లి బాలమల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగం నేరం

ఎల్బీనగర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 120 మైక్రాన్ల ప్లాస్టిక్ కవర్ల వినియోగం, ఆహార పదార్థాల ప్యాకింగ్ చేయడాన్ని ప్రభుత్వం నిషేధించిందని అనుమతి నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగం నేరమని జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ ఉప కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ చెప్పారు. శుక్రవారం సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని పలు వ్యాపార సంస్థలతో పాటు హోటళ్లు, టిఫిన్ సెంటర్లను జీహెచ్‌ఎంసీ అధికారులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ సర్కిల్ హెల్త్ అండ్ శానిటేషన్ విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) చందనచౌహాన్, శానిటరీ సూపర్‌వైజర్ బుచ్చయ్య, జవాన్ వినోద్, ఎస్‌ఎఫ్‌ఏలు శివ, ప్రేమ్‌కుమార్, చిరంజీవి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

స్కూల్ పిల్లలకు పెడుతున్నది దొడ్డు బియ్యం భోజనమే

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపణ
- సన్న బియ్యం పేరుతో మభ్య పెడుతున్నారని ధ్వజం



నాదర్‌గుల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సబితారెడ్డి

సరూర్‌నగర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకంలో సన్న బియ్యంతో కాకుండా దొడ్డు బియ్యం భోజనమే వడ్డిస్తున్నారని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆమె బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం కోసం వండిన అన్నం పరిశీలించిన ఆమె.. ఇది సన్నబియ్యం అన్నం కాదని, దొడ్డు బియ్యంతోనే వండారని నిర్ధారించారు. భోజనం చూస్తేనే ఏ బియ్యమో తెలుస్తున్నదని, ఇందులో ఎవరి తప్పిదం ఉన్నదో అధికారులు విచారణ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పేరుతో విద్యార్థులను సైతం మోసం చేస్తున్నదని సబితారెడ్డి ధ్వజమెత్తారు. వెంటనే విద్యాశాఖ అధికారులు దీనిపై విచారణ జరిపాలని, విద్యార్థులకు సన్నబియ్యం భోజనం వడ్డించేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్కూల్ హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలి : సీపీ సుధీర్‌బాబు



పతకాలు సాధించిన సిబ్బంది, అధికారులతో సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అసామాన్యప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సేవా పతకాల ద్వారా గుర్తిస్తారని, కమిషనరేట్ పరిధిలో ఈ సేవా పతకాలు సాధించిన వారిలో కానిస్టేబుల్ నుంచి అడిషనల్ డీసీపీ వరకు ర్యాంకు అధికారులు ఉన్నారని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి శుక్రవారం కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీపీ సుధీర్‌బాబు పతకాలు అందించి, అభినందించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు 65మంది సిబ్బంది, అధికారులకు ఉత్తమ సేవ, సేవా పతకాలు అందజేశారు. పోలీసు శాఖలో విధుల నిర్వహించడం, అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎటువంటి రిమార్కులు లేకుండా పతకాలు స్వీకరించడం ఆనందదాయకమని, ఇదే స్ఫూర్తితో విధుల పట్ల అంకితభావం, మంచి ప్రతిభ కనబరిచి, ప్రజలకు పోలీసు వారి సేవలను అందించాలని, అదేవిధంగా పోలీసు శాఖకు మంచి పేరు ప్రతిష్టలు వచ్చేలా విధులు నిర్వహించాలని సీపీ కోరారు. అనంతరం భువనగిరి ఏసీపీగా పని చేస్తున్న రాహుల్‌రెడ్డికి ఆడిషనల్ ఎస్పీ ప్రమోషన్ రావడంతో అభినందించారు. కార్యక్రమంలో డీసీపీలు పద్మజ, ప్రవీణ్‌కుమార్, ఆకాంక్ష్‌యాదవ్, సునీతారెడ్డి, అరవింద్‌బాబు, ఇందిర, రమణారెడ్డి, జి.నరసింహారెడ్డి, మనోహర్, శ్రీనివాసులు, నాగలక్ష్మి, శ్యాంసుందర్‌రెడ్డితోపాటు ఆడిషనల్ డీసీపీలు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌తో ఇంటి పరిసరాలు పరిశుభ్రం : వనిపల్లి



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పోరెడ్డి రవీందర్‌రెడ్డి తదితరులు

చంపాపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొంటే తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలో శుక్రవారం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమానికి శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ ఉద్యమం దేశాన్ని ఆరోగ్యవంతమైన దిశగా నడిపించే ప్రజా కార్యక్రమం అని కొనియాడారు. అనంతరం బైరామల్‌గూడ చెరువు పరిసరాలలో పిచ్చి మొక్కలను వారు తొలగించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాజేంద్రప్రసాద్, నందికొండ గీతారెడ్డి, జిల్లా కార్యదర్శి నరేష్‌యాదవ్, నాయకులు గూడూరు అవినాష్‌రెడ్డి, ఎలుకల మల్లేష్‌గౌడ్, లక్ష్మీప్రసాద్, టంగ్రీకర్ రాజేష్, యోగిరాజ్, కిరణ్‌రెడ్డి, అమూల్యరెడ్డి, తిరుపతి, శ్రవణ్‌కుమార్, విజయ్, రుతిక, జనార్దన్‌రెడ్డి, వేణుగోపాల్, నరేందర్‌రెడ్డి, రాజుగౌడ్, బూరం ప్రకాష్, కళ్యాణ్ పాల్గొన్నారు.

శాస్త్రవేత్త నుంచి రూ.90వేలు తస్కరించిన గుర్తు తెలియని వ్యక్తి

చంపాపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇరువురి మధ్య స్నేహం ఉన్నట్లు ఓ వ్యక్తి ఫోన్‌లో మాట్లాడి భార్య అనారోగ్యం బారిన పడినట్లు, డబ్బులు అవసరాని శాస్త్రవేత్తకే టోకరా వేశాడు ఓ సైబర్ మోసగాడు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ డీఆర్‌డీఏ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న శాస్త్రవేత్త భాస్కరాచారి(57) 10రోజుల కిందట ఆతనికి మౌర్య అను వ్యక్తి ఫోన్ చేశాడు. కొత్త నెంబరుతో ఫోన్ వచ్చినా తనకు పరిచయం ఉన్న వ్యక్తే ఫోన్ చేయడంతో శాస్త్రవేత్త మాట్లాడారు. మౌర్య మాట్లాడి తనకు వాట్సాప్ కాల్ చేయాలని కోరడంతో శాస్త్రవేత్త ఆయను అంగీకరించి మాట్లాడారు. తన భార్యను అనారోగ్యంతో ఆస్పత్రిలో చేర్పించానని, తనకు లక్ష రూపాయలు చాలా అవసరం అని చె ప్పడంతో శాస్త్రవేత్త అతనికి రూ.90వేలను వెంటనే ట్రాన్స్‌ఫర్ చేశాడు. మరుసటి రోజు తిరిగి మౌర్య శాస్త్రవేత్తకు ఫోన్‌చేసి మరికొంత డబ్బు కావాలని కోరడంతో అతనికి అనుమానం వచ్చింది. తన ఫోన్‌లో సేవింగ్‌లో ఉన్న నెంబరు కాకుండా వేరే నెంబరు రావడంతో శాస్త్రవేత్తకు అనుమానం వచ్చింది. దీంతో నెంబరుతో శాస్త్రవేత్త తన స్నేహితుడు మౌర్యతో మాట్లాడటంతో అసలు విషయం తెలిసి తాను మోసపోయినట్టు గ్రహించాడు. వెంటనే అతను 1930నెంబరుతో సైబర్ క్రైంకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశా డు. సైబర్ క్రైం వారు కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తెలుపడంతో శుక్రవారం సాయంత్రం శాస్త్రవేత్త నుంచి ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపారు.

వృద్ధురాలి బంగారు గొలుసులు చోరీ




వృద్ధురాలు రాముసుందరి

వనస్థలిపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి కళ్లలో కారం చల్లి, చేతి కొరికి ఆమె మెడలో ఉన్న రెండు బంగారు గొలుసులు గుర్తు తెలియని మహిళ అపహరించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్సూరాబాద్ సహారా కాలనీలోని 3/7 ప్లాట్‌లో రిటైర్డ్ డాక్టర్ నిరంజన్(78), భార్య రాముసుందరి(73)లు నివాసముంటారు. శుక్రవారం ఉదయం నిరంజన్ మార్నింగ్ వాక్ కోసం బయటకు వెళ్లాడు. ఈ సమయంలో వృద్ధురాలు రాముసుందరి తలుపులు దగ్గరకు వేసుకుని స్నానానికి వెళ్లింది. ఆమె స్నానం చేసి తిరిగి బయటకు వచ్చే సరికి హాల్ గుర్తు తెలియని మహిళ ఒక్కసారిగా ఆమె దగ్గరకు వచ్చి తన వెంట తెచ్చుకున్న కారాన్ని ఆమె తలపై, కళ్లల్లో చల్లింది. ఆ సమయంలో వృద్ధురాలు ఆమెచేయిని పట్టుకోవడంతో చేయిని గట్టిగా నోటితో కొరికింది. వెంటనే ఆమె మెడలో ఉన్న 6తులాలు ఉండే రెండు బంగారు గొలుసులను అపహరించి అక్కడ నుంచి పరారైంది. వృద్ధురాలు వెంటనే బయటకు వచ్చి స్థానికులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు సీసీ కెమెరాలతో గుర్తు తెలియని మహిళ ఆచూకీ కోసం ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి హత్యకేసులో వీడిన మిస్టరీ

- మేనకోడలే నిందితురాలు
- 30 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్

సైదాబాద్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ విష్ణునగర్‌లో ఈనెల 14న జరిగిన వృద్ధుడి హత్యకేసు మిస్టరీ వీడింది. వృద్ధుడిని హత్య చేసింది మేనకోడలుగా సైదాబాద్ పోలీసులు నిర్ధారించారు. నిందితురాలిని అరెస్ట్ చేసి చోరీసొత్తు 30తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ వివరాలు వెల్లడించారు. విష్ణునగర్‌లో కట్టోతు శివయ్య(70) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. వీరి సమీపంలో శివయ్య భార్య సోదరుడి కూతురు(మేనకోడలు) నేనావత్ మంగ(48) భర్త చనిపోవడంతో ఐఎస్‌సదన్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆయాగా పనిచేస్తూ ఇద్దరు కుమారులతో కలిసి ఉంటుంది. కొంతకాలంగా మేస్త్రీ వెంకటేశ్‌తో సన్నిహితంగా ఉంటుంది. ఈ క్రమంలో శివయ్య నూతన ఇల్లు నిర్మించి ఇవ్వడంకు మంగ మధ్యవర్తిగా ఉండి మేస్త్రీ వెంకటేశ్‌కు రూ.8.25 లక్షల నగదు ఇప్పించింది. ఇల్లు అసంపూర్తిగా, నాణ్యత లేకుండా కట్టడంతో మంగను వృద్ధుడు ఇవ్వకుండా దూషించాడు. అంతేగాకుండా నిందితురాలికి అప్పులబాధలు కూడా ఉండడంతో శివయ్యను అంతమొందించాలని పథకం వేసింది. ఘటన జరిగిన రోజు మధ్యాహ్నం రొట్టెలు చేస్తున్నడంతో తమ ఇంట్లోకి పొగ వస్తుందంటూ మృతుడు దుర్భాషలాడాడు. దీంతో నిర్మాణ పనులు జరుగుతున్న ఇంటిలో ఈనెల 14వ అర్ధరాత్రి ఒంటరిగా నిద్రిస్తున్న శివయ్యపై దాడి చేసింది. ముందుగా ఇనుపరాడ్డుతో తల, మెడ పైన దాడి చేసి ఊపిరి ఆడకుండా చేసి వైర్‌తో గొంతు నులిమి హత్య చేసింది. మృతుడి ఒంటిపై ఉన్న రెండు వెండి కడియాలు, మొలతాడు తెంపుకుని పోయి ఇంట్లో దాచిపెట్టింది. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అనుమానంతో నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా గుట్టు రట్టయింది. దీంతో ఆమె ఇంట్లో దాచిన 30తులాల వెండి ఆభరణాలు, హత్యకు ఉపయోగించిన ప్లాస్టిక్ వైర్, దిండు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సూపర్ మార్కెట్లలో కాలం చెల్లిన వస్తువులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లోని పలు సూపర్ మార్కెట్లలో జీహెచ్‌ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. 44మార్కెట్లలో తనిఖీలు నిర్వహించి.. పరీక్షల నిమిత్తం 58 నమూనాలను నాచారంలోని రాష్ట్ర ఫుడ్ లేబొరేటరీకి పంపారు. సైదాబాద్‌లోని మోర్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో గడువు ముగిసిన యాపిల్ ఫ్లాక్, కాచిగూడ ఎక్స్ రోడ్డులోని రిలయన్స్ లిమిటెడ్‌లో గడువు ముగిసిన అవకాడో, యాపిల్, ఆరెంజ్ ఫ్లాక్‌లు, కొండాపూర్‌లోని విజేత సూపర్ మార్కెట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఎల్లో రింగ్స్, పాలక్ రైస్ పాపడ్, గోడ్రెజ్ జెర్సీ బిస్కెట్, కొండాపూర్ రాజరాజేశ్వరనగర్‌లోని కేఫీఎస్ ఫ్రెష్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అతిథి హోం ఫుడ్స్‌కు చెందిన డ్రైఫ్రూట్ పూత రేకులు, చెక్కెర గవ్వలు, బెల్లం సున్నుండలు, ఎసిఎమ్‌డి గ్రీన్ యాపిల్, కొండాపూర్‌లోని రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో చీపిక జున్ను, స్వీట్ కార్న్, కలర్ క్యాప్సికమ్ మిక్స్ ప్యాకెట్లు గుర్తించారు. ఉల్లంఘనలకు పాల్పడినందుకు ఆయా సంస్థలకు నోటీసులు జారీ చేసినట్లు జీహెచ్‌ఎంసీ ఒక ప్రకటనలో పేర్కొంది.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

కొత్తపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం నర్సింహా తెలిపారు. డీఈఓ సుశీందర్‌రావు సూచనల మేరకు శుక్రవారం పాఠశాలలో స్కూల్ స్టూడెంట్ కౌన్సిల్ ఏర్పాటు చేశారు. ప్రతీ తరగతి నుండి ఇద్దరు విద్యార్థులు కౌన్సిల్ ఎంపిక చేసి, ప్రతినిధులను ఎన్నుకున్నారు. హెడ్ బాయ్, హెడ్ గర్ల్, కెప్టెన్, వైస్ కెప్టెన్, గ్రీన్ కెప్టెన్‌లతో కౌన్సిల్ ఏర్పాటు చేశారు. ఎన్నికైన కౌన్సిల్ ప్రతినిధులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

'అందెల' చొరవతో సుల్తాన్‌పూర్‌కు ఆర్టీసీ బస్సు

సరూర్‌నగర్ : బడంగ్‌పేట్ కార్పొరేషన్ 14వ డివిజన్‌లోని సుల్తాన్‌పూర్‌కు ఎట్టకేలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కలిగింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ చొరవతో ఆర్టీసీ అధికారులు బస్సు నడపడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బీజేపీ క్లస్టర్-1 అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సుల్తాన్‌పూర్ గ్రామస్తులు అందెలను కలిసి అనంతరం ఆర్టీసీ మిధాని డిపో అధికారులను కలిసి విజ్ఞప్తులు అందజేశారు. దాంతో అధికారులు రూట్ సర్వే నిర్వహించి బస్సు సౌకర్యం కల్పించారు. కొత్తగా ఏర్పాటు చేసిన బస్సును శుక్రవారం గ్రామస్తులతో కలిసి శ్రీరాములుయాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు రావుల మల్లేశ్, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

హయత్‌నగర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రకృతి ప్రసాదించిన పూలతో విద్యార్థులు, అధ్యాపకురాలు బతుకమ్మను పేర్చి బతుకమ్మ ఆటను ఆడారు. అనంతరం ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా ఉత్తమ బతుకమ్మకు బహుమతి ప్రదానం చేశారు. కళాశాల సాంస్కృతిక కోఆర్డినేటర్ అపర్ణ వకుళేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు ఇందిర, రమాదేవి, నాగేంద్ర, నరసింహ, ధనరాజ్, రమాదేవి, సుబ్రహ్మణ్యం, గీతానాయక్, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, శారద, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను గుర్తుంచుకోవాలి

కొత్తపేట: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను గుర్తుంచుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రావహూడి సూచించారు. శుక్రవారం సాగర్‌రింగ్‌రోడ్ సమీపంలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ నుండి 113మంది విద్యార్థులు రాచకొండ చిల్డ్రన్ ట్రాఫిక్ ట్రెయినింగ్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్, సిబ్బంది రమేష్ వారికి ట్రాఫిక్ రూల్స్ వీడియోలు, స్లైడ్స్ ప్రదర్శించారు.

ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోండి

సైదాబాద్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బానునగర్‌కాలనీ పార్కులో జీహెచ్‌ఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆమె ప్రారంభించారు. పార్కుకు వచ్చేవారికి, ఉదయం వాకింగ్‌కు వచ్చేవారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు విద్యాసాగర్‌రెడ్డి, వేణుమాధవ్‌రెడ్డి, నరసింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, నరేష్‌నాయక్, జగదీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇరువురి మధ్య గొడవ, ఒకరిపై మరొకరు దాడి

చాదర్‌ఘాట్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇరువురి మధ్య చిన్న విషయంలో తలెత్తిన గొడవతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. అనంతరం చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. చాదర్‌ఘాట్ ఎస్ఐ సురేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సైదాబాద్ కుర్మగూడ నివాసి అభిషేక్ స్టూడెంట్. గురువారం మధ్యాహ్నం తన పెద్ద నాన్నకు డయాలసిస్ కోసం హైదరాబాద్ కిడ్నీ సెంటర్‌కు తీసుకొచ్చాడు. మలక్‌పేట హైస్కూల్ వద్ద రాంగ్ సైడ్‌లో బైక్‌పై వస్తున్న అక్బర్‌బాగ్ నివాసి అన్వర్‌తో గొడవ తలెత్తింది. డయాలసిస్ అనంతరం అభిషేక్ తిరిగి వెళ్తుండగా అన్వర్ మళ్లీ గొడవ పడ్డారు. ఇరువురి మధ్య మాటామాట పెరగడంతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. అనంతరం చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో అభిషేక్, అన్వర్‌లు పరస్పరం ఫిర్యాదులు చేసుకోగా కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.